పోరుకు సిద్ధమైన కార్యదర్శులు

● ఎంపీడీఓలకు సమ్మె నోటీసులు అందజేత

ధన్వాడ: పంచాయతీ కార్యదర్శులు తమను పర్మినెంట్ చేయాలన్న డిమాండ్‌తో సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ సద్గుణకు శనివారం సమ్మె నోటీసులు అందజేశారు. విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఆంజనేయులు, భాగ్య, కవిత, రాజు, రాము, షాహబేగం తదితరులు ఉన్నారు.

దామరగిద్ద: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమను పర్మినెంట్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీఓ శశికలకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శులు కృష్ణ, భాను, విజయ్, రవి, కీర్తి, శ్రీలత, తిమ్మప్ప, వేణు పాల్గొన్నారు.

ఊట్కూరు: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సంఘం జిల్లా నాయకులు రాజు, నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓకు సమ్మె నోటీసులు అందజేశారు. పంచాయితీ కార్యదర్శులు రాజేష్, సాయినాథ్, అచ్యుతానంద, నాగిరెడ్డి, మంజుల, శివలీల తదితరులు పాల్గొన్నారు.


ఊట్కూరులో ఎంపీడీఓకు సమ్మె నోటీసులు అందజేస్తున్న కార్యదర్శులు


ధన్వాడలో..


దామరగిద్దలో..

క్లుప్తంగా

రంజాన్ కిట్ల పంపిణీ



ధన్వాడ: రంజాన్‌ను పురస్కరించుకుని శనివారం ముస్లింలకు పండుగ కిట్లను అందజేశారు. స్థానిక పెద్ద మసీదులో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమేష్, సుధీర్‌కుమార్, కొండారెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

ధన్వాడ: పిడుగుపాటుకు ఆవుమృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కొండాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రైతు యాదవరెడ్డి గ్రామానికి రెండు కిల్లోమీటర్ల దూరంలో ఉన్న తన పొలంలో ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం ఆవును కట్టేసి ఇంటికి వచ్చారు. శనివారం ఉదయం వెళ్లి చూడగా ఆవు పిడుగుపాటుతో మృతిచెందిందని గుర్తించాడు. రూ. వేలలో నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

మక్తల్: నియోజకవర్గంలో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని టీడీపీ జిల్లా నాయకుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మక్తల్ మండలంలోని పలు గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంబండ ప్రాజెక్ట్ కింద నీరు వదిలితే పంటలు పండుతాయని ఆశపడి రైతులు వరినాట్లు వేశారని అన్నారు. పంట తెగుళ్ల బారినపడి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అన్నారు. నాయకులు రాంరెడ్డి, భూపతిరెడ్డి, ఉమాపతి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణపై తనిఖీ



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహిస్తున్న ఎస్ఏ2 పరీక్షలను క్లస్టర్ హెచ్ఎం నర్సిములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పరీక్షలను సబ్జెక్టుల వారీగా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. హెచ్ఎం మణెమ్మ, సీఆర్పీ నర్సిములు, ఉపాధ్యాయులు అనిల్ కుమార్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మేకల చోరీ : కేసు నమోదు

కోస్గి: వ్యవసాయ పొలంలోని పాకలో ఉంచిన మేకలను చోరీ చేసిన ఘటనపై శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు పట్టణానికి చెందిన గాళ్ల బుగ్గప్ప సర్జఖాన్‌పేట రోడ్డులోని శివారులో ఉన్న తన సొంత వ్యవసాయ పొలం పాకలో నాలుగు మేకలను కట్టేశాడు. ఈ క్రమంలో గతనెల 27న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మేకలను ఎత్తుకెళ్లారు. ఎంత వెతికినా జాడ తెలియకపోవడంతో బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు రూ. 29 వేల విలువైన నాలుగు మేకలు చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

మక్తల్: మండలంలోని కర్నిలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా 11 వవార్డు కుర్వగేరిలో మురుగు నీరు ఇళ్ల మధ్య నిలుస్తోందని, దీంతో దోమలు బెడద పెరిగిపోందని వాపోతున్నారు. అదేవిధంగా పందులు సంచరిస్తున్నాయని, దుర్గంధం వెదజల్లుతోందని ఫలితంగా రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, అవసరమైన మేరకు మురుగు కాల్వల నిర్మాణం చేపట్టి డ్రెయినేజీ వ్యవస్థను బాగుపరచాలని కోరుతున్నారు.

13 మందికి రూ. 22 వేలు జరిమానా

మక్తల్: మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడిపిన కేసుల్లో 13 మందికి రూ. 22 వేలు జరిమానా విధించారు. ఎస్ఐ పర్వతాలు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేరువేరు ఘటనల్లో మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడిపిన 13 మందిపై కేసులు నమోదు అయ్యాయి. ఈ మేరకు వారిని నారాయణపేట అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ జడ్జి సయ్యద్ జక్రియా సుల్తానా ఎదుట శనివారం హాజరు పరచగా మొత్తం రూ. 22 వేలు జరిమానా విధించారని పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

చిన్నపొర్లలో ఇఫ్తార్



ఊట్కూర్: మండలంలోని చిన్నపొర్లలో మసీద్ వద్ద ముస్లింలు శనివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజక వర్గ నాయకులు కే.ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, షరీఫ్, మీరాజ్, కుర్షీద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు మరువలేం

నర్వ: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ సేవలు మరువలేం అని, ఆయన గొప్ప దార్శనికుడని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు మహేందర్ అన్నారు. నాగిరెడ్డిపల్లిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి శనివారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామచంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు కుర్మన్న, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

అంబేడ్కర్ జాతర వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్లతో నాయకులు

దామరగిద్ద: జిల్లా కేంద్రంలో ఈ నెల 17 న నిర్వహించనున్న అంబేడ్కర్ జాతరను జయప్రదం చేద్దామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఉద్మల్‌గిద్దలో ప్రజా సంఘాలతో కలిసి అంబేడ్కర్ జాతర వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. గద్దర్, డాక్టర్ ఖాసీం తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా రానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జాతర ప్రచార కార్యదర్శి హన్మంతు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటప్ప, బుగ్గప్ప, నరసింహా, రఘు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల ఎత్తు పెంచండి

మరికల్: మండలకేంద్రం నుంచి నారాయణపేటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల తరుచుగా కల్వర్టుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలను నివారణ కోసం కల్వర్టుల ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందని అంటున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అదేవిధంగా మరికల్, అప్పంపల్లి గ్రామాల మధ్యన ఉన్న కల్వర్టులూ తక్కువ ఎత్తులో ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. పదుల సంఖ్యలో ప్రాణాలు పోయిన ఘటనలూ జరిగాయని బాధ్యులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి కల్వర్టుల ఎత్తు పెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.


ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

కంకర తేలిన బీటీ రోడ్డు


చర్లపల్లి గ్రామానికి వెళ్లే దారిలో తేలిన కంకర

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ నుంచి హన్మన్‌పల్లి, చర్లపల్లి గ్రామాల వరకు వెళ్లే బీటీరోడ్డు మొత్తం కంకరతేలిందని, అక్కడక్కడా గుంతలమయంగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. దీంతో ఈ దారిలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు. కంకర తేలడంతో ద్విచక్రవాహనాలు తరచూ అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. రోడ్డును బాగుచేయాలని ఎన్నసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరమ్మతు చేయిస్తామని చెబుతున్నారే కానీ చర్యలు మాత్రం చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో నిత్యం ఈ దారిలో ధన్వాడ, కొండాపూర్‌లకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

దాతల సహకారంతో ఆలయ నిర్మాణం

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో దాతల సహకారంతో కట్టమిద్ది ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులు గ్రామస్తులు ప్రారంభించారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి ఆలయాన్ని ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వైభవంగా బోనాల వేడుక నిర్వహిస్తామని వివరించారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.


ప్రారంభమైన ఆలయ నిర్మాణ పనులు

ఆలయ కమిటీల ఏర్పాటుపై వినతి

మక్తల్: నియోజకవర్గంలో ఆలయ కమిటీలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హైదరాబాద్‌లో శనివారం వినతి పత్రం అందజేశారు. అమరచింతలోని కిష్టంపల్లి, నందిమల్ల, ఈర్లదిన్నే, మక్తల్‌లో శ్రీపడమటి అంజనేయస్వామి, గుడేబల్లూర్, గట్టుతిమ్మప్ప తదితర ఆలయ కమిటీల ఏర్పాటుకు సత్వర్య చర్యలు తీసుకోవాలని కోరారు.


మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డైరెక్టర్లు

కోస్గి: ప్రభుత్వం చేపట్టిన రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై పట్టణంలో శివసాయి అయ్యప్ప దేవాలయం ఆవరణలో మండలంలోని గొర్రెల పెంపకం దారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారిణి విజయలక్ష్మి, సంఘం డైరెక్టర్లు పలు సూచనలు చేశారు. జిల్లా డైరెక్టర్లు అల్లాపురం నర్సిములు, హన్మంతు, మండలంలోని 25 సంఘాల అధ్యక్షులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

‘సీపీఎస్ మార్చ్ విజయవంతం చేద్దాం’

నారాయణపేట రూరల్ : కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగులు ఆదివారం జిల్లా కేంద్రంలో చేపడుతున్న సీపీఎస్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానం అమలు జరిగే వరకు పోరాటం చేద్దామని, నూతన విధానంతో రిటైర్‌మెంట్ తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఉదయం 10గంటలకు మున్సిపల్ పార్క్ వద్ద ర్యాలీ ప్రారంభమై ఆర్డీఓ కార్యాలయం, పాతబస్టాండ్, శ్రీసత్యనారాయణ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు.

ఆత్మీయ సమ్మేళనం అ‘పూర్వం’


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నారాయణపేట: హైదరాబాద్ నగరంలో శనివారం నారాయణపేట పట్టణానికి చెందిన పూర్వ విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 47 ఏళ్ల తర్వాత కలుసుకని చిన్ననాటి రోజులను నెమరు వేసుకొంటూ సరదాగా గడిపారు. వీరు 1972 నుంచి 1982 మధ్య ప్రాథమిక వైదిక పాఠశాల, యూపీఎస్ సికిల్‌గేరి పాఠశాలల్లో విద్యాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తమలో కొంత మంది టీచర్లుగా, మరికొందరు ప్రభుత్వ శాఖల్లో వివిధ విభాగాల్లో స్థిరపడినట్లు వివరించారు. సీసీఐ మార్కెటింగ్ అధికారి పస్పుల వెంకట్ రాములు, సీనియర్ పాత్రికేయుడు బాలకిషన్ రావుని శాలువాతో సత్కరించారు. అదేవిధంగా మహిళా మిత్రులకు చీరలను, జ్ఞాపికలను అందించారు. బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వై మహేశ్‌కుమార్, కేంద్రీయ విద్యాలయ పీజీటీ రాఘవేంద్ర గుప్తా, ప్రభుత్వ టీచర్లు శశికళ, శంకరమ్మ, రేవతి, నాగలక్ష్మి, ఆర్టీసీలో పనిచేస్తున్న సునీత, విద్యా సంస్థ నిర్వహిస్తున్న డీవీవీ ప్రసాద్‌రెడ్డి ఉన్నారు. అదేవిధంగా సహకార శాఖ అధికారి నాగార్జున, వ్యాపారవేత్తలు లకంసీ పటేల్, హన్మంతురావు, గోవిందరావు, రవీందర్, చంద్రకాంత్, సీతారాములు తమ అనుభవాలను పంచుకున్నారు.

ఇసుక ట్రాకర్ల పట్టివేత

ఊట్కూరు: మండలంలోని పగిడిమర్రి శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం తెల్లవారుజామున పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అబ్జల్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం జైగిరం గ్రామానికి చెందిన భీమేష్, సుభాష్‌లు ఇసుకను అక్రమంగా తరలిస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది మాత్రునాయక్, శివకుమార్‌లకు పట్టుబడ్డారని వివరించారు. ఈ మేరకు ట్రాక్టర్‌లను స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

మరికల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలకు వెంటనే వీధిదీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు బాల్‌రాజ్, గోపాల్, రఘు అన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఈ దారిలో విషసర్పాలు తిరుగుతున్నందున వీధిదీపాలు లేకపోవడంతో శివారులో ఉన్న పీహెచ్‌సీకి గ్రామస్తులు రాత్రి సమయంలో వెళ్లడానికి జంకుతున్నారని వాపోయారు. ఇప్పటికై నా ప్రజాప్రతినిధులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

మాగనూర్: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటం చేయాలని, హక్కులను సాధించుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీను అన్నారు. శనివారం మాగనూర్ మండలం ఉజ్జెల్లిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ముదిరాజ్‌లు అధికంగా ఉన్నారని ఎవరికీ ఆపద వచ్చిన తమ వంతుగా సహకారం అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో బస్వరాజు, కనకప్ప, నర్సిములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మక్తల్: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ –143 జిల్లా ప్రధానకార్యదర్శి పృథ్విరాజ్‌ను రాష్ట్ర ముదిరాజ్ సంఘం ప్రధానకార్యదర్శి జి శ్రీనివాస్ మక్తల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా శనివారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో జర్నలిస్టుల పాత్ర ప్రముఖమైందని ఆయన కొనియాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతి, నవీన్‌కుమార్, రమేష్, యాదగిరి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మాగనూర్: మండల కేంద్రంలో వర్కూర్ క్రాస్ రోడ్డు పక్కన మిషన్‌భగీరథ పైపులైన్ కోసం ఏర్పాటు చేసిన గేట్‌వాల్ పై కప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు గేట్‌వాల్‌ను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. పాఠశాలకు సమీపంలోనే ప్రమాదకరంగా ఉండడంతో గేట్‌వాల్‌కు పై కప్పు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికై నా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


మాట్లాడుతున్న ఎస్ఐ నరేందర్

మాగనూర్: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాలు నియంత్రించ వచ్చని మాగనూర్ ఎస్ఐ నరేందర్ అన్నారు. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు కొల్పూర్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో సురేందర్, శేఖర్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి జయంతి


మద్దూర్‌లో అభిషేకం


మక్తల్‌లో..

మద్దూరు: మండల కేంద్రంలోని కాచెరువు వద్ద ఉన్న ఆలయ నిర్మాణ స్థలంలో శనివారం అయ్యప్ప స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. మండల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పూజారి మద్వేష్‌చారీ గణపతి, కుమారస్వామి, అయ్యప్ప స్వామికి అష్టోత్తరాలు, అంగపూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి సర్పంచ్ దంపతులు అరుణ, వెంకట్‌రాములు గౌడ్ అభిషేకం చేశారు. మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, రాజిరెడ్డి, అంజయ్య, ప్రకాష్, అంబర్‌నాథ్ గ్రామస్తులు సంజీవ్, వెంకటయ్య, విఠల్, నర్సిములు, మోనేషాచారీ, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: అయ్యప్ప స్వామి జయంతి సందర్భంగా శనివారం మక్తల్ పట్టణంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, మహా మంగళహారతి తదితర పూజలను నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ సొంత ఖర్చులతో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు చంద్రకాంత్‌గౌడ్, అశోక్‌గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.